**345 వ అధ్యాయం**

## ٣٤٥ - بَابُ كَرَاهَةِ تَخْصِيصِ يَوْمِ الْجُمُعَةِ بِصِيَامٍ أَوْ لَيْلَتِهِ بِصَلاَةٍ مِنْ بَيْنِ اللَّيَالِي

## జుమా నాటి పగలుని ఉపవాసాల కోసం, రాత్రిని నమాజుల కోసం ప్రత్యేకించుకోవటం అవాంఛనీయం

١٧٦٢ - عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «لَا تَخُصُّوا لَيْلَةَ الْجُمُعَةِ بِقِيَامٍ مِنْ بَيْنِ اللَّيَالِي، وَلَا تَخُصُّوا يَوْمَ الْجُمُعَةِ بِصِيَامٍ مِنْ بَيْنِ الأَيَّامِ إِلَّا أَنْ يَكُونَ فِي صَوْمٍ يَصُومُهُ أَحَدُكُمْ» رواه مسلم.

1762. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీరు ఇతర రాత్రులకు భిన్నంగా జుమానాటి రాత్రిని (నఫిల్) నమాజుల కోసం ప్రత్యేకించుకోకండి. అలాగే ఇతర పగళ్ళకు భిన్నంగా జుమానాటి పగలును ఉపవాసం కోసం ప్రత్యేకించుకోకండి. ఒకవేళ మీలో ఎవరికయినా తన అనవాయితీ ప్రకారం ఆ రోజు ఉపవాసం ఉండవలసి వస్తే అది వేరే విషయం. *(ముస్లిం)*

*(సహీహ్ ముస్లింలోని సియామ్ ప్రకరణం)*

**ముఖ్యాంశాలు**

ఒక వ్యక్తి తన అనవాయితీ ప్రకారం రోజు విడిచిపెట్టి రోజు ఉపవాసముంటున్నప్పుడు మధ్యలో జుమా రోజు వస్తే లేక ఆషూరా లేక అరఫా దినాలు జుమా రోజు వస్తే లేక పున్నమి దినాల్లో జుమారోజు వస్తే లేక మొక్కుబడి ఉపవాసాలు పాటిస్తున్నప్పుడు మధ్యలో ఏదయినా రోజు జుమా రోజయితే- ఆ రోజు ఉపవాసం పాటించటంలో ఎలాంటి తప్పులేదు. అయితే ప్రత్యేకంగా జుమా రోజునే ఉపవాసం పాటిస్తూ ఉండటం మాత్రం అవాంఛనీయం.

١٧٦٣ - وَعَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ «لا يَصُومَنَّ أَحَدُكُمْ يَوْمَ الْجُمُعَةِ إِلَّا يَوْماً قَبْلَهُ أَوْ بَعْدَهُ» متفقٌ عليه.

1763. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజి) గారే తెలియజేశారు: మీలో ఎవరూ కూడా ప్రత్యేకించి శుక్రవారం రోజు ఉపవాసం పాటించరాదు. ఒకరోజు అటో ఇటో

కలుపుకొని పాటించాలి.

(బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని సౌమ్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని సియామ్ ప్రకరణం)

**ముఖ్యాంశాలు**

ఈ హదీసులో శుక్రవారం రోజు ఉపవాసం ఉండే పద్ధతి వివరించబడింది. శుక్రవారంతోపాటు గురు శనివారాల్లో ఏదో ఒకరోజుని కలుపుకొని రెండు రోజులు ఉపవాసం పాటించాలని చెప్పబడింది.

1764. హజ్రత్ ముహమ్మద్ బిన్ అబ్బాద్ కథనం: నేను జాబిర్ గారిని "దైవప్రవక్త (సల్లం) శుక్రవారం రోజు ఉపవాసం ఉండవద్దని వారించారా?" అని అడిగాను. అందుకాయన 'అవును ' అని సమాధానమిచ్చారు.

(బుఖారీ-ముస్లిం)

١٧٦٤ ـ وَعَنْ مُحَمَّدِ بْنِ عَبَّادٍ قَالَ: سَأَلْتُ جَابِراً رَضِيَ اللهُ عَنْهُ: أَنَهَى النَّبِيُّ ﷺ عَنْ صَوْمِ الجُمُعَةِ؟ قَالَ: نَعَمْ. متفقٌ عليه.

(సహీహ్ బుఖారీలోని సౌమ్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని సియామ్ ప్రకరణం)

1765. విశ్వాసుల మాతృమూర్తి జువైరియా బిన్తె హారిస్ (రజి.అన్హా) కథనం ప్రకారం తను ఒక శుక్రవారం ఉపవాసం ఉన్నప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆమె వద్దకు వచ్చారు. అప్పుడాయన ఆమెను, "నిన్న నువ్వు ఉపవాసం ఉన్నావా?" అని అడిగారు. ఆమె లేదని చెప్పారు. ఆయన మళ్ళీ "మరి రేపయినా ఉపవాసం ఉండాలనుకుంటున్నావా?" అని అడిగారు. ఆమె లేదని చెప్పారు. అప్పుడాయన, "మరయితే ఉపవాసం విరమించుకో" అని చెప్పారు. (బుఖారీ)

١٧٦٥ ـ وَعَنْ أُمِّ المُؤْمِنِينَ جُوَيْرِيَةَ بِنْتِ الحَارِثِ رَضِيَ اللهُ عَنْهَا أَنَّ النَّبِيَّ ﷺ دَخَلَ عَلَيْهَا يَوْمَ الجُمُعَةِ وَهِيَ صَائِمَةٌ، فَقَالَ: «أَصُمْتِ أَمْسِ؟» قَالَتْ: لا، قَالَ: «تُرِيدِينَ أَنْ تَصُومِي غَداً؟» قَالَتْ: لا، قَالَ: «فَأَفْطِرِي» رَوَاهُ البُخَارِي.

(సహీహ్ బుఖారీలోని సౌమ్ ప్రకరణం)

**ముఖ్యాంశాలు**

కేవలం శుక్రవారం రోజు ఉపవాసం పాటించటం కన్నా పాటించకుండా ఉండటమే మేలని ఈ హదీసు ద్వారా బోధపడుతోంది.